క్లుప్తంగా

దేవీ నవరాత్రులు ప్రారంభం



ధ్వజారోహణంలో అర్చకులు, భక్తులు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభించారు. ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. గోపూజతోపాటు, సర్వదేవతలను ఆహ్వానిస్తూ వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఆగమశాస్త్ర ప్రకారం అంకురార్పణ, అఖండ దీపారాధన, నవగ్రహ మండపారాధన తదితర కైంకర్యాలు పూర్తి చేశారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దిలీప్‌కుమార్

పుత్తూరు: పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుడు దిలీప్‌కుమార్ తన తండ్రి సీఎస్ బాబు జ్ఞాపకార్థం గురువారం స్థానిక వృద్ధాశ్రమంలోని మహిళలకు చీరలు, భోజనం అందించారు. పార్టీ నాయకుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బాబు విద్యా రంగానికి అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పేదలకు సాయం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థ రహిత పంచాయతే లక్ష్యం



పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందిస్తున్న సర్పంచ్ శేఖర్‌రెడ్డి

కార్వేటినగరం: వ్యర్థ రహిత పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పారిశుధ్య కార్మికులు పని చేయాలని సర్పంచ్ శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం కేపీ అగ్రహారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ నిత్యం మన ఆరోగ్యం కోసం త్యాగం చేసే పారిశుధ్య కార్మికులను గౌరవించడం మన బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. వ్యర్థ పదార్థాలను మురుగు నీటి కాలువలు, రోడ్లపై వేయకుండా పారిశుధ్య కార్మికులను అందించి వారికి సహాయపడాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. వారికి పనిముట్లను అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వాతి, మహిళా పోలీసు సుజాత, ఏఎన్‌ఎం భాగ్యం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు తప్పనిసరి

వెదురుకుప్పం: విద్యార్థులు రక్త పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ లావణ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్త పరీక్ష ద్వారా రక్త గ్రూపులను తెలుసుకోవాలని చెప్పారు. రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా శరీరంలో వ్యాపించే వ్యాధులను గుర్తించే ఆస్కారముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎర్రసానమ్మ, ఆర్ఆర్సీ కమిటీ మెంబర్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యంషాపులకు దరఖాస్తుల స్వీకరణ



మురళీమోహన్, ఎక్సైజ్ సీఐ

పుత్తూరు: పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కేటాయించిన 18 మద్యం షాపులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. గురువారం సీఐ విలేకరుల సమావేశంలో ప్రభుత్వం ప్రకటించిన ప్రైవేటు నూతన మద్యం షాపుల ఏర్పాటు వివరాలను వెల్లడించారు. స్టేషన్ పరిధిలోని పుత్తూరు మండలానికి 7, నారాయణవనానికి 3, వడమాలపేటకు 4, రామచంద్రాపురానికి 4 షాపులను కేటాయించినట్లు తెలిపారు. షాపుల కోసం ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ లేక నేరులో గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 11వ తేదీ తిరుపతిలోని శిల్పారామం అర్బన్ హాట్‌లో లాటరీ పద్ధతిలో డ్రా తీయడం జరుగుతుందని వివరించారు. 12వ తేదీ నుంచి షాపులను నిర్వహించుకోవచ్చన్నారు. ఇందుకు తిరిగి చెల్లించబడని రూ.2 లక్షల దరఖాస్తు ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. పుత్తూరు మండలంలో షాపు పొందిన ఒక్కో దరఖాస్తుదారుడు 2024–25 ఏడాదికి గాను లైసెన్స్ ఫీజు కింద రూ.65 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2025–26 ఏడాదికి గాను రూ.71.50 లక్షలు చెల్లించాలని వెల్లడించారు. ఇతర మండలాలకు చెందిన వారు తొలి ఏడాది లైసెన్స్ ఫీజు కింద రూ.55 లక్షలు చెల్లించాలని, రెండవ ఏడాది రూ.60.50 లక్షలను చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఆధార్ కార్డు ఒరిజినల్, 3 జెరాక్స్ కాపీలు, 2 ఫొటోలు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాస్‌బుక్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్‌లను తీసుకురావాలని తెలిపారు.

పుత్తూరు: శ్రీబాలా త్రిపుర సుందరిగా అంకాలమ్మ, **ఎస్సార్‌పురం:** శైలపుత్రికగా ఆరిమానిగంగమ్మ, **పాలసముద్రం:** దుర్గాదేవిగా పడవేటమ్మతల్లి, రాజరాజేశ్వరిగా పరమేశ్వరి, పుష్పపల్లకిలో చెవుటి గంగమ్మతల్లి, **కార్వేటినగరం:** బాలా త్రిపుర సుందరిగా బంగారమ్మ








అమ్మ అనుగ్రహించే వేళ..

- దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం
- ముస్తాబవుతున్న ఆలయాలు
- నేటి నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు

నగరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. శుక్రవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారి ఆలయాలకు వెళ్లి దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో ఆలయాలు, పరిసర ప్రాంతాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. పెద్ద ఎత్తున మహిళలు వీటిలో పాల్గొంటారు.

అమ్మవారి అలంకరణలు

దసరా సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. నేత్ర ప్రదాయణి దేశమ్మ దేవాలయంలో 4న బాలత్రిపుర సుందరి, 5న గాయత్రీదేవి, 6న అన్నపూర్ణా దేవి, 7న లలితా త్రిపుర సుందరి, 8న శ్రీమహాలక్ష్మి. 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, నగరి పట్టణంలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షీదేవి సన్నిధి, ఓంశక్తి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, నెత్తం కండ్రిగలోని కరుమారియమ్మ ఆలయం, నింద్ర మండలంలోని ఓంశక్తి ఆలయం, పుత్తూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శివాలయం, రాచపాళెం లక్ష్మీదుర్గమ్మ కొండ, ఆరేటమ్మ ఆలయాలు శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఓంశక్తి ఆలయంలో ఈ నెల 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు ఆలయం వద్ద అన్నదానం చేయనున్నారు. తొమ్మిది రోజుల పాటు పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండడంతో అమ్మవారి అలంకరణ, పూజాది కార్యక్రమాలకు ఇప్పటికే పురోహితులకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఇంటి శుభకార్యాలకు, ఇతర వేడుకలకు పురోహితులు దొరకడం కష్టతరంగా మారింది.

శైల పుత్రికగా ఆరిమాని గంగమ్మ

శ్రీరంగరాజపురం : దసరా నవరాత్రుల ఉత్సవంలో భాగంగా మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లెలో వెలసిన శ్రీ ఆరిమాని గంగమ్మ నవరాత్రుల ఉత్సవాన్ని ప్రారంభించారు. వంశపారంపర్యంగా జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అర్చకులు వేకువ జామున అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం 9 గంటలకు శ్రీమహ గణపతి షోడశపూజ, బాలగణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారిని పూర వీధుల్లో శైల పుత్రికగా భక్తులకు దర్శనమిచ్చారు. దీనికి స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీపీ సరిత, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, ధర్మకర్త లింగారెడ్డి, కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



నగరి: ముస్తాబవుతున్న కాశీవిశ్వేశ్వరాలయం



నగరి: ముస్తాబవుతున్న దేశమ్మ దేవాలయం

ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

పుత్తూరు: పుత్తూరులోని అమ్మవారి ఆలయాల్లో గురువారం దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయాన్నే అన్ని ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

వడమాలపేట మండలం పూడి క్రాస్ వద్ద గల శ్రీ అంకాలమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీబాలా త్రిపుర సుందరీ దేవిగా పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువు దీర్చారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలు విద్యుత్‌దీపకాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి.




గంగాధర నెల్లూరు: బాలా త్రిపుర సుందరిగా అల్లియల్లమ్మ మూలవిరాట్, ఉత్సవ విగ్రహం

కనుల పండువగా శరన్నవరాత్రి

పాలసముద్రం : మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం కనులపండువగా ప్రారంభమయ్యాయి. బలిజకండ్రిగ వెలసిన చెవుటి గంగమ్మతల్లి, మిద్దినత్తంలో వెలసిన పడవేటమ్మతల్లి, నొచ్చిలిలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరీ సమేత గంగాధరేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పడవేటమ్మ తల్లిని దుర్గాదేవి అలంకరం, గిరిరాజ కన్యకా పరమేశ్వరి రాజరాజేశ్వరి అలంకారంతో. చెవుటి గంగమ్మ తల్లిని వివిధ సంగంధన పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బాలా త్రిపుర సుందరిగా అల్లి యల్లమ్మ తల్లి

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీ అల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో దసరా మహోత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం మూలవిరాట్ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బాలా త్రిపుర సుందరి దేవికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం దాదాపు 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పార్థసారథి రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరిగా బంగారమ్మ

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం బంగారమ్మ బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శన మిచ్చారు. అర్చకులు వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనే, నారికేళ జలాలు వంటి సుగంధ భరిత ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పిండి దీపాలు వెలిగించి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్ తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రంగనాత మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

వైభవంగా లక్షకుంకుమార్చన

స్కంధ పుష్కరిణి సమీపంలో వెలసి ఉన్న శ్రీరాజరాజేశ్వరీ దేవీ ఆలయంలో వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, ధ్వజారోహణం, ప్రాకారోత్సవం నిర్వహించారు. లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఆలయ పూజారి అందించారు.

సాగులో మెలకువలు పాటించాలి



వేరుశనగలోని తెగుళ్ల నివారణపై రైతులకు వివరిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం : మండల పరిధిలోని రైతన్నలు వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. వెంగళరాజుకుప్పం, పాలసముద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ముగిసిన తరువాత గ్రామంలో రైతులు సాగుచేసిన వేరు శనగ, చెరకు పంటను వారు క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. అనంతరం రైతులతో ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని దానిద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్ భోరాన్ జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. అపరాలతో పంట మార్పిడి చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే పంట అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యాజమాన్యంపై చర్యల గురించి వివరించారు. చెరకులో బిందుసేద్యం పద్ధతిలో పంటలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. వరిపంటలో డ్రమ్ సీడర్ పద్ధతిలో పంట సాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. కూలీలు కూడా తక్కువే, వరిలో ఆకు ముడత, కాండము తొలుచుపురుగు నివారణ చర్యలు, చెరకులో ఎరువులు వాడేటప్పుడు తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు.

7 నుంచి లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

గంగాధర నెల్లూరు : మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుంచి 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ, అడ్వొకేట్ కే.ఎస్ వాసు, ఆలయ మేనేజర్ వెంకటేశులు రెడ్డి తెలిపారు. తొలిరోజు అంకురార్పణ, 8న ధ్వజారోహణం, శేష వాహనం, సింహ వాహనం, 9న మోహినీ అవతారం, కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం, 10న హనుమంత వాహనం, గజ వాహనం, 11న రథోత్సవం, అశ్వవాహనం 12న చక్రస్నానం, ద్వాదశ ఆరాధనం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేయనున్నట్లు వివరించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత

నగరి : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం 5 కోట్ల ఆంధ్రుల కర్తవ్యమని దీనికి సంఘటిత ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్దన్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం ఉదయం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులను ప్రదర్శించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నాడు విశాఖ స్టీల్ సాధనకు మూకుమ్మడిగా వామపక్ష శాసనసభ్యులు రాజీనామా చేసి ఉద్యమానికి తోడ్పాటును ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని కూటమి నేతలు బాబు, పవన్ ఈ విషయంపై స్పందించక మౌనం వహించడం దారుణం. ఇటీవల 4 వేల మంది కార్మికులకు ఉద్వాసన పలకడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకులు షబ్బీర్ బాషా, ఏఐవైఎఫ్ కార్యదర్శి విజయన్, నాయకులు మురళి, శేఖర్, సతీష్, మునిరాజ్, నగోమి, రాజేంద్రన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బెండ సాగు.. భలే బాగు

కూరగాయల మార్కెట్‌లో ఏడాది పొడవునా డిమాండ్ ఉన్న ఏకైక సాగు బెండ. దీనికి సమయం, కాలం, నెలలు అవసరం లేదు. ఏ సీజన్‌లో అయినా ఈ సాగు చేసుకోవచ్చు. బెండకాయ మాత్రం అన్ని కాలాల్లోనూ సాగుకు అనుకూలమైంది. అంతే కాకుండా లాభదాయకం కూడా. ప్రస్తుత కాలంలో కూరగాయలు సాగుచేసే రైతుల పాలిట వరంగా మారుతుంది. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించవచ్చు.

- ఏడాది పొడవునా పంటకు డిమాండ్
- అన్ని కాలాల్లో సాగు చేయవచ్చు
- ఆసక్తి చూపుతున్న రైతులు



విజయపురంలో సాగులో ఉన్న బెండ పంట



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న బెండ

విజయపురం : నగరి నియోజకవర్గంలో రైతులు అధికంగా బెండ సాగు చేసి లాభాలబాటలో సాగుతున్నారు. విజయపురం, నింద్ర, నగరి, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో సుమారు 100 హెక్టార్లకు పైగా బెండ సాగులో ఉంది. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన నగరి, విజయపురం మండలంలో అధికంగా బెండ సాగులో ఉంది. ఇక్కడ సాగు చేసిన కూరగాయలను పక్క రాష్ట్రంలోని తిరుత్తణి, కొయంబేడు మార్కెట్‌కు తరలిస్తుంటారు. రవాణా సౌకర్యం ఉండడంతో రైతులు కూరగాయల సాగులో ఆసక్తి చూపుతున్నారు. అందులో ఎక్కువగా బెండ సాగు చేస్తున్నారు.

మార్కెట్‌లో స్థిరమైన రేటు

బెండకాయలకు మార్కెట్‌లో ఎప్పుడూ స్థిరమైన రేటు ఉంటుంది. దీంతో చాలామంది రైతులు బెండ సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. తగిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. బెండ సాగు, మెలకువలు, సస్యరక్షణ చర్యలు తెలుసుకుంటే మంచి దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చు.

అనుకూలమైన నేలలు

ఉదజని సూచిక 6.0 నుంచి 6.8 వరకు ఉండే నేలలు బెండ సాగుకు అనుకూలంగా ఉంటాయి. సేంద్రియ పదార్థాలతో సమృద్ధిగా ఉన్న వదులైన, మెత్తని, బాగా ఆరిన ఇసుక నేలల్లోనూ బెండ పంట విరగ కాస్తుంది. సారవంతమైన ఒండ్రు నేలలు, తేలిక పాటి నల్లరేగడి నేలలు, గరుప నేలల్లోనూ అధిక దిగుబడి సాధించవచ్చు. అయితే, క్షార స్వభావం ఉన్న నేలలు, ఉప్పు నేలలు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని నేలల్లో బెండ సాగు మంచిది కాదు. పంట వేయడానికి ముందే భూసార పరీక్షలు, నీటి నాణ్యత పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

విత్తనశుద్ధి

కిలో బెండ విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్, తర్వాత 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. నాటడానికి 24 గంటల ముందు ట్రైకోడెర్మా ఎస్పీపీ (4–10 గ్రా./ కేజీ విత్తనానికి), సూడోమోనాస్ ఎస్పీ (10 గ్రా./ కిలో విత్తనానికి) సమపాళ్లలో కలుపుకొని, విత్తన శుద్ధి చేయాలి. వీటిని రాత్రంతా తడి ఆరనిచ్చి, మరుసటి రోజు విత్తుకోవాలి.

నేల తయారీ

హైబ్రిడ్ రకాలు ఎకరానికి ఒక కిలో చొప్పున, సాధారణ రకాలైతే ఎకరానికి రెండు నుంచి మూడు కిలోల చొప్పున అవసరం అవుతాయి. విత్తుకునే ముందు భూమిని నాలుగైదుసార్లు కలియ దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి ఎనిమిది నుంచి పది టన్నుల పశువుల ఎరువు, 30 కిలోల భాస్వరం, పొటాష్ చొప్పున వేసుకోవాలి. సాళ్ల మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన వెంటనే నీరు పెట్టి, నాలుగైదు రోజుల తర్వాత రెండో తడి ఇవ్వాలి. మొలకలు వచ్చిన తర్వాత పాదుకు ఒక మొక్కను ఉంచి, మిగతావి తీసేయాలి.

బెండ రకాలు

బెండలో అనేక రకాలున్నాయి. అయితే, వాతావరణానికి అనుకూలమైన రకాలను ఎంచుకోవడం వల్ల ఎక్కువ దిగుబడులు పొందవచ్చు. మార్కెట్‌లో సుమారు 10 రకాల బెండ విత్తనాలు ఉన్నాయి. అందులో సాధారణంగా మన ప్రాంతాల్లో ఆకుపచ్చ బెండకాయ, ఎర్ర బెండ కాయలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. ఆకు పచ్చ బెండకాయ రెండు రోజుల కోసారి కోతకు వస్తుంది. ఎర్ర బెండ కాయలు మూడు రోజులకోసారి కోయాల్సి ఉంటుంది. అయితే ఎర్ర బెండకాయలో ఎక్కువ గుజ్జు ఉండడంతో పోషకాలు అధికంగా ఉంటాయి. ధర కూడా అధికంగా ఉంటుంది.

కలుపు నివారణ

ఇది దీర్ఘకాలపు పంట. పంట కాలంలో సుమారు మూడు నుంచి నాలుగు సార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. విత్తనాలు వేసిన రెండు వారాలకు కలుపు నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఆ తర్వాత సమస్యను బట్టి కలుపును తొలగించుకోవాలి. తోట పూర్తిగా పెరిగే వరకూ, మొక్కల వద్ద మట్టిని పారతో పైకి ఎగదోయాలి. కలుపు సమస్య, కూలీల సమస్య ఎక్కువగా ఉన్నప్పుడే రసాయన మందులు వాడాలి. కలుపు సమస్య ఎక్కువగా ఉండే నేలలైతే ఎకరానికి 100 లీటర్ల నీటిలో 500 మి.లీ. పిండి మిథాలిన్‌కలిపి, విత్తనం నాటిన మరుసటి రోజే నేలపై పిచికారీ చేయాలి.

స్థిరమైన ఆదాయం

ఏడాది పొడవునా సాగయ్యే కూరగాయల పంట బెండ. నాలుగు నెలల కాలపరిమితి ఉండే ఈ పంటలో, హైబ్రిడ్ రకాలు అందుబాటులోకి వచ్చాక, ఎప్పుడైనా సాగు చేసుకోవచ్చు. మార్కెట్‌లో హైబ్రిడ్ రకాలు అందుబాటులో ఉండడం వల్ల రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుంది. సకాలంలో పోషకాలు అందించి, తగిన మెలకువలు పాటిస్తే బెండలో మంచి దిగుబడి సాధించవచ్చు.

నీటి యాజమాన్య పద్ధతులు

బెండ సాగులో నీటి యాజమాన్య పద్ధతులను తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. విత్తనాలు విత్తిన వెంటనే నీరు పెట్టాలి. ఆ తర్వాత నేల రకం, వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడులు ఇవ్వాలి. నల్లరేగడి నేలల్లో అయితే ప్రతి ఐదారు రోజులకు నీరు అందించాలి. పూత, కాయ దశల్లో మొక్కలను నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. లేకుంటే, కాయ పరిమాణం, దిగుబడిపై ప్రభావం చూపుతుంది. ఒకవేళ నీరు తక్కువగా ఉన్నట్లయితే బిందు సేద్యం పద్ధతిని ఆశ్రయించడం మంచిది.

కోత, దిగుబడి

బెండ విత్తనాలు వేసిన 45 నుంచి 55 రోజులకు మొదటి కోత వస్తుంది. 130 రోజుల వరకు దిగుబడిని ఇస్తుంది. ప్రతి రెండు మూడు రోజులకోసారి తప్పకుండా కాయలను కోయాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే, ప్రతి రోజూ ఎకరానికి 100 కిలోల నుంచి 150 కిలోల వరకూ దిగుబడి వస్తుంది. మార్కెట్లో కనీస ధర కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు ఉన్నా, లక్షలకుపైగా ఆదాయం ఆర్జించవచ్చు.